ఇది కద నిజం



# ముక్కోటి ఏకాదశి వేడుకలకు యాదగిరిగుట్ట సిద్ధం




ఇది కద నిజం, యాదగిరిగుట్ట: శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానం, యాదగిరిగుట్టలో ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్న ముక్కోటి ఏకాదశి మరియు అధ్యయనోత్సవాల సందర్భంగా గురువారం ప్రధాన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు కార్యక్రమాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ముక్కోటి ఏకాదశి, అధ్యయనోత్సవాలకు సంబంధించిన బ్రోచర్లు, పాంప్లెట్లు, వాల్ పోస్టర్లు మరియు ఆహ్వాన పత్రాలను దేవస్థానం కార్యనిర్వహణాధికారి, అనువంశిక ధర్మకర్త సంయుక్తంగ ఆవిష్కరించారు.

ఆవిష్కరించిన ప్రచార పత్రాలలో ముక్కోటి ఏకాదశి మరియు అధ్యయనోత్సవాలకు సంబంధించిన పూర్తి కార్యక్రమ వివరాలు, తేదీలు, ఏర్పాట్లు భక్తుల అవగాహనార్థం పొందుపరచినట్లు అధికారులు తెలిపారు. అలాగే ధర్మ ప్రచారంలో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో నిర్దిష్ట తేదీలలో శ్రీ స్వామివారి కళ్యాణం వైభవోపేతంగా నిర్వహించనున్న విషయాన్ని కూడా ఈ ప్రచార సామగ్రిలో పేర్కొన్నారు.

ఇదే సందర్భంలో డిసెంబర్ మాసానికి సంబంధించిన దేవస్థానం మాసపత్రికను కూడా ప్రధాన ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆవిష్కరించారు. భక్తులందరూ ఈ పవిత్ర కార్యక్రమాల్లో విశేష సంఖ్యలో పాల్గొని శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి కృపకు పాత్రులవాలని దేవస్థానం అధికారులు కోరారు.

# 9వ ఎలైట్ మెన్ అండ్ ఉమెన్ తెలంగాణ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్




ఇది కద నిజం, హైదరాబాద్: హైదరాబాద్ జిల్లా బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో షేక్‌పేట్ బాక్సింగ్ క్లబ్‌లో 9వ ఎలైట్ మెన్ అండ్ ఉమెన్ తెలంగాణ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌ను ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించబడుతాయి. మూడు రోజుల పాటు సాగె ఈ పోటీలకు తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన సుమారు 200 మంది పురుష, మహిళా బాక్సర్లు పాల్గొంటారు. ఈ రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్‌కు హైదరాబాద్ జిల్లా బాక్సింగ్ ఫెడరేషన్ సంపూర్ణ ఏర్పాట్లు చేసింది. పోటీల్లో పాల్గొనే బాక్సర్లకు వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో పాటు క్రీడాకారులకు అనుకూల వాతావరణంలో పోటీలు నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు సాగె ఈ పోటీల్లో బాక్సర్లు తమ ప్రతిభను ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకోబోతున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, షేక్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ రషీద్ ఫరాజుహుద్దీన్, ప్రముఖ క్రీడాభిమాని చిన్న శ్రీశైలం యాదవ్, తోలిచౌకి ఏసీపీ సయ్యద్ ఫియాజ్, గోల్కొండ సీఐ సైదులు తదితరులు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్ జిల్లా బాక్సింగ్ ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ రాజు, ప్రధాన కార్యదర్శి వినేష్ బాబు ఆధ్వర్యంలో జరగనున్నాయి.


# ఓటమి తర్వాత కూడా మాట తప్పని సుధాకర్



ఇది కద నిజం, క్యాసారం: క్యాసారం గ్రామానికి చెందిన సుధాకర్ ముదిరాజ్ బీజేపీ పార్టీ అభ్యర్థిగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలో గెలిచినా ఓడినా గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉంటానని ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఎన్నికల్లో ఓటమి ఎదురైనప్పటికీ రాజకీయాలకతీతంగా గ్రామ ప్రజల కోసం పనిచేస్తూ తన మాటను నిలబెట్టుకోవడం విశేషంగా మారింది. ఎన్నికల ప్రచారం సమయంలో గ్రామంలోని కార్ధనుర్ వీరమని ఇంటి వద్ద బోరు వేయిస్తానని ఇచ్చిన మాట ప్రకారం తాజాగా అక్కడ బోరు వేయించి, తాను ఇచ్చిన హామీని నెరవేర్చారు. దీంతో గ్రామస్తులు మన్ని సుధాకర్‌ను అభినందిస్తూ, మాటకు కట్టుబడి ఉండే నాయకుడిగా ప్రశంసలు కురిపిస్తున్నారు.

ఈ సందర్భంగా సుధాకర్ ముదిరాజ్ మాట్లాడుతూ, ఎన్నికల్లో గెలుపు ఓటములు రాజకీయాల్లో సహజమని, అయితే ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే తనకు ముఖ్యమని తెలిపారు. గ్రామాభివృద్ధే తన లక్ష్యమని, పార్టీ భేదాలు, రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని మన్ని సుధాకర్ స్పష్టం చేశారు.

# శాంత ఋష్య శృంగ అన్నదానం విభాగంలో ఈఓ ఆకస్మిక తనిఖీ



ఇది కద నిజం, యాదగిరిగుట్ట:శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానంలోని "శాంత ఋష్య శృంగ అన్నదానం" విభాగంలో ఈరోజు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం విభాగంలో అమలులో ఉన్న క్యూలైన్ నిర్వహణ, భక్తులు వేచి ఉండే హాలులో భద్రతా ఏర్పాట్లు, అన్న ప్రసాద రుచి, ఆహార నాణ్యత, పరిశుభ్రత తదితర అంశాలను ఆయన సమీక్షించారు. తనిఖీ సమయంలో భక్తులతో నేరుగా మాట్లాడిన ఈఓ, అన్నప్రసాద రుచి, నాణ్యత, సిబ్బంది ప్రవర్తన, నిర్వహణపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అన్నదానం నిర్వహణపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు.

ఎలాంటి భక్తుడికీ అసౌకర్యం కలగకుండా అన్ని అవసరమైన ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఈఓ ఆదేశించారు. పరిశుభ్రతను మరింత మెరుగుపరచేందుకు ఎలక్ట్రిక్ క్లీనింగ్ వాహనాలను ఏర్పాటు చేసి వినియోగించాలని సూచించారు. అలాగే ఆలయంలో భక్తులకు అందిస్తున్న సేవలు, నిర్వహణ తీరుపై భక్తులతో చర్చించారు. అన్నదానం హాలులో ప్రతి క్యూలైన్‌లో కూర్చున్న భక్తులతో వ్యక్తిగతంగా మాట్లాడిన ఈఓ, వారి సూచనలను నమోదు చేసుకున్నారు. అన్నదానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దాతల కౌంటర్ (డోనర్ సెల్)ను పరిశీలించి, విరాళాలకు సంబంధించిన రిజిస్టర్లు, క్యూఆర్ కోడ్ స్కానర్‌ను తనిఖీ చేశారు.



వంటశాల, స్టోర్ రూమ్, రికార్డ్స్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అన్నదానం విభాగ సిబ్బంది, సేవకులతో మాట్లాడి, విధి నిర్వహణలో మరింత క్రమశిక్షణ పాటించాలని సూచించారు.

దేవస్థానం అందిస్తున్న విశ్వసనీయ సేవలను భక్తులకు మరింత విస్తృతంగా చేరవేసేలా కృషి చేయాలని, విరాళాలు పెరిగే విధంగా చర్యలు తీసుకుని భవిష్యత్తులో నిత్య అన్నప్రసాదం మరింత మంది భక్తులకు అందేలా చూడాలని సంబంధిత ఈఓలు, పర్యవేక్షకులు, ఇన్‌చార్జీలకు ఆదేశాలు జారీ చేశారు.

భక్తుల రద్దీని బట్టి క్యూలైన్ వ్యవస్థలో అవసరమైన చోట మార్పులు చేయాలని భద్రతా సిబ్బందికి సూచించారు. భక్తుల సౌకర్యార్థం అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, వసతులను సమర్థవంతంగా వినియోగించాలని సిబ్బందిని కఠినంగా హెచ్చరించారు. అన్నదానం భవనం ప్రవేశద్వారం వద్ద భక్తుల సౌకర్యం కోసం చప్పల్ స్టాండ్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తాగునీటి శుద్ధి వ్యవస్థను పరిశీలించి, జల ప్రసాద నీటి స్వచ్ఛతను నిర్ధారించారు. తాగునీటి నాణ్యత, భద్రతపై భక్తుల అభిప్రాయాలను కూడా ఈ సందర్భంగా తెలుసుకున్నారు.

# క్యాసారం గ్రామంలో సర్పంచ్, వార్డు సభ్యులకు యువకుల ఘన సన్మానం



ఇది కద నిజం, క్యాసారం: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, ఉప సర్పంచ్ మలగల వెంకట్, మరియు వార్డు సభ్యులు నక్క మైపాల్, కొన్న నవీన్ సుభాష్ రెడ్డి, మహమ్మద్ పాషా, మైలారం ప్రభు, విశ్వేందర్ రెడ్డి ను క్యాసారం గ్రామ యువకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత, పెద్దలు పాల్గొన్నారు. సన్మాన కార్యక్రమంలో యువకులు వారి అభినందనలు తెలియజేస్తూ, నూతన సర్పంచ్, ఉప్ప సర్పంచ్, వార్డు మెంబర్లకు శాలువాలతో సన్మానించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, " మాకు గ్రామానికి సేవ చేసే అవకాశాన్ని కల్పించిన గ్రామ ప్రజలకు, యువతకు కృతజ్ఞతలు. గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తాము. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే ప్రయత్నం చేస్తాము" అని తెలిపారు. మలగల వెంకట్, నక్క మైపాల్ మరియు ఇతర వార్డు సభ్యులు కూడా ప్రజల ఆశీస్సులు, మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు. వారు గ్రామంలో బహుముఖ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రామాణికమైన పనులు చేస్తామని హామీ ఇచ్చారు.

# భాగ్యారధి డిగ్రీ కళాశాలలో ఘనంగా పోషణ దినోత్సవం



ఇది కద నిజం: భాగ్యారధి డిగ్రీ కళాశాల, సైన్స్ విభాగం ఆధ్వర్యంలో పోషణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూట్రిషన్ విభాగం విద్యార్థులు వివిధ రకాల పోషకాహార పదార్థాలతో ప్రత్యేక ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేసి, పోషకాహారం ప్రాముఖ్యతతో పాటు షుగర్, రక్తపోటు, స్థూలకాయం, రక్తహీనత వంటి జీవనశైలి వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులుగా ఆకుల సతీష్ గారు, నేవాలి వెంకట్ రెడ్డి గారు (చైర్మన్, భాగ్యారధి డిగ్రీ కళాశాల), నల్ల జయ శంకర్ గౌడ్ గారు (డైరెక్టర్, భాగ్యారధి డిగ్రీ కళాశాల), ప్రిన్సిపల్ కె. నవీన్ రాజ్ గారు అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ, నేటి సమాజంలో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో పోషణపై అవగాహన అత్యంత అవసరమని తెలిపారు. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల ద్వారా సమాజానికి ఆరోగ్య సందేశం అందించడం అభినందనీయమన్నారు. కళాశాల చైర్మన్ నేవాలి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, విద్యతో పాటు ఆరోగ్యంపై చైతన్యం కల్పించడమే భాగ్యారధి డిగ్రీ కళాశాల లక్ష్యమని చెప్పారు. న్యూట్రిషన్ విభాగం విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్ ద్వారా పోషకాహారం ప్రాముఖ్యతను స్పష్టంగా తెలియజేశారని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక



బాధ్యతను పెంపొందిస్తాయని తెలిపారు.డైరెక్టర్ నల్ల జయ శంకర్ గౌడ్ మాట్లాడుతూ, పోషణ అనేది కేవలం ఆహారం మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలికి పునాదిగా ఉంటుందని అన్నారు. చిన్న వయస్సు నుంచే సరైన ఆహార అలవాట్లు అలవరుచుకుంటే అనేక వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని చెప్పారు. విద్యార్థులు చేసిన ప్రయత్నం ప్రశంసనీయమని తెలిపారు.ప్రిన్సిపల్ కె. నవీన్ రాజ్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పోషణపై శాస్త్రీయ అవగాహనను ప్రజలకు వివరించగలిగారని అన్నారు. అధ్యాపకులు, విద్యార్థుల సమన్వయంతో ఈ కార్యక్రమం విజయవంతమైందని తెలిపారు. ఈ పోషణ దినోత్సవ కార్యక్రమం ద్వారా విద్యార్థులు సమాజానికి ఆరోగ్యకరమైన జీవనశైలి పై చైతన్యం కల్పించారని అతిథులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది.

# పాశమైలారం చెరువులో విషపు నీరు...

## చైతన్య క్లోరైడ్, ఎమ్మెస్ ఎన్, హైదరాబాద్ కెమికల్ కంపెనీలు సహా మరికొన్ని పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కలుషిత నీరు, రసాయన వ్యర్థాలు

- ఇది కాలుష్యం కాదు.. ప్రజలపై జరుగుతున్న నెమ్మదైన హత్య!
- కెమికల్ వ్యర్థాలతో మృత్యు ఘంటిక
- భయాందోళనలో పరిసర గ్రామాలు
- అంతరించిపోతున్న జలచరాలు
- చూసీ చూడనట్టు అధికారుల నిర్లక్ష్య ధోరణి



ఇది కద నిజం , పాశమైలారం: పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న ప్రధాన చెరువు నేడు ప్రజల జీవనానికి శాపంగా మారింది. ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో కళకళలాడిన ఈ చెరువు, ప్రస్తుతం విషపు నీటితో నిండిపోయి మృత్యు కుండలా మారింది. పరిశ్రమల నుంచి వెలువడుతున్న ప్రమాదకర కెమికల్ వ్యర్థాలు నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తూ చెరువులోకి నేరుగా వదులుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చైతన్య క్లోరైడ్, ఎమ్మెస్ ఎన్, హైదరాబాద్ కెమికల్ కంపెనీలు సహా మరికొన్ని పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కలుషిత నీరు, రసాయన వ్యర్థాలు చెరువులో కలుస్తుండటంతో నీటి రంగు మారిపోగా, తీవ్ర దుర్వాసన వ్యాపిస్తోంది. చెరువు చుట్టూ నివసించే ప్రజలు ఆ ప్రాంతానికి వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. నీటిలో విషపూరిత రసాయనాల మోతాదు పెరగడంతో చేపలు, కప్పలు, ఇతర జలచరాలు పెద్ద సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి. చెరువు ఒడ్డున మృత చేపల దృశ్యాలు ప్రజలను కలచివేస్తున్నాయి. ఒకప్పుడు రైతులకు జీవనాధారంగా నిలిచిన ఈ చెరువు నేడు పశువులకు కూడా ఉపయోగించలేని స్థితికి చేరింది.

ఇక్కడితో సమస్య ఆగడం లేదు. చెరువులో కలుస్తున్న కెమికల్ వ్యర్థాల ప్రభావం భూగర్భ జలాలపై పడుతున్నట్లు స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోర్లు వేసుకుంటే నీరు కలుషితమవుతుందేమోనన్న భయం ప్రజలను వెంటాడుతోంది. తాగునీటి భద్రతపై గ్రామాలన్నీ గడగడలాడుతున్నాయి. ఇంత తీవ్రమైన పరిస్థితి నెలకొన్నా సంబంధిత కాలుష్య నియంత్రణ శాఖలు, రెవెన్యూ అధికారులు, పరిశ్రమల పర్యవేక్షణ విభాగాలు మాత్రం చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పరిశ్రమలు యథేచ్ఛగా చెరువులను కలుషితం చేస్తున్నా ఇప్పటివరకు ఒక్క కఠిన చర్య కూడా ఎందుకు తీసుకోలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజల ఆరోగ్యం, ప్రాణాల పట్ల ప్రభుత్వానికి బాధ్యత లేదా? అధికార యంత్రాంగం ఎన్నికల వేళ మాత్రమే ప్రజలను గుర్తుకు తెచ్చుకుంటుందా? అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది కాలుష్యం కాదు, ప్రజలపై జరుగుతున్న నెమ్మదైన హత్య అని మండిపడుతున్నారు.

పాశమైలారం చెరువు విషయంలో తక్షణమే స్వతంత్ర విచారణ జరిపి, బాధ్యులైన పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. చెరువును శుద్ధి చేసి, భూగర్భ జలాలను రక్షించడంతో పాటు ప్రజలకు భద్రత కల్పించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే ఇది రాబోయే రోజుల్లో భారీ పర్యావరణ, ఆరోగ్య విపత్తుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

